# అప్పు ఇచ్చి చూడు!

**ఆ** రోజుతో పరీక్షలు పూర్తయ్యాయి. ప్రయాణం ఎల్లుండి కాబట్టి ఈ రెండు రోజులూ ఏం చేద్దామా అని ప్రోగ్రాము నిర్ణయించుకుంటూ అంతా రూములోనే వున్నాం.

ఇంతలో అప్పారావు హడావుడిగా వచ్చి ''ఒక వందరూపాయల అప్పు ఇవ్వగల మహానుభావులెవరైనా వున్నారా?" అన్నాడు రెండుచేతులు నడుంమీద పెట్టుకు నిలబడి. అప్పారావు నిజంగా సార్థక నామధేయుడే. ఇంటి దగ్గర నుండి వచ్చిన డబ్బంతా మొదటివారంలోనే జల్సా చేసేసి, ఆ తర్వాత అప్పుల కోసం అందరి చుట్టూ తిరుగుతాడు!

"ఇక్కడ మహానుభావులెవరూ లేరు నాయనా! అంతా మామూలు జనమే!" ప్రసాద్ అన్నాడు చిరునవ్వుతో. "లేకేం, వున్నాడు" అంటూ అప్పారావు సూర్యం దగ్గర చేరి మొదలుపెట్టాడు.

"నీకు మొన్ననేగా ఎం.ఒ. వచ్చింది. ఒక్క వందరూపాయలు సర్దరా, పుణ్యం వుంటుంది."

"వద్దు...వద్దు, పుణ్యం సంపాదించి స్వర్గానికి పోవాలని నాకేంలేదు. మామేష్టారొకాయన చెప్పే వారు – స్వర్గం ఏమీ బావుండదట. నిశ్శబ్దంగా, కాళీగా వుంటుంది. మైలుదూరానికొక మునీశ్వరుడు చొప్పున కూర్చుని తపస్సు చేసుకుంటూ వుంటారు. అదే నరకమైతే జనంతో కళకళలాడుతూ సందడిగా, గ్లామరస్‌గా వుంటుంది. మనకు తెలిసిన బంధుమిత్రులూ, సినిమా తారలూ, రాజకీయనాయకులూ అంతా వుంటారక్కడ. అందుకని నరకానికి పోవటమే బెస్టు. పుణ్యం సంపాదించుకోవటం శుద్ధ వేస్టు!" అవకాశం వస్తే ఉపన్యాసం ఇవ్వటం అలవాటైన సూర్యం అన్నాడు.

"పోనీ, అలాగే నరకానికే పోదువుగానిరా, డబ్బివ్వరా! కావాలంటే 'శీఘ్రమేవ శాశ్వత నరకవాస ప్రాప్తిరస్తు!' అని దీవిస్తాను! దారి తప్పకుండా నువ్వు నరకానికే పోవాలని ప్రార్థనలు కూడా చేస్తాను. సరేనా?"

"ఎందుకు నాయనా నీకు డబ్బిచ్చి నరకానికి పోవటం? ఎవరి దగ్గరైనా డబ్బు దోచుకుని నరకానికిపోతే, ఇహమూ, నరకమూ రెండూ లాభించినట్లుగానీ!"

సూర్యం మాటలకు హతాశుడైపోయినట్లుగా కుర్చీలో వాలిపోయాడు.

అప్పటి వరకూ ఆలోచనా సముద్రంలో మునిగిపోయినట్లున్న సారథి తెప్పరిల్లి ఓకేక పెట్టాడు.

"అప్పాజీ, నీకు డబ్బు కావాలంటే ఒక మార్గం వుంది. ఒక చిన్న డేష్ పూర్తి చేస్తేచాలు వందరూపాయలకేష్ నీ చేతిలో పడుతుంది. నిన్న సత్యమూర్తి ఒక కార్టూన్ చూపించి దాని కాప్షన్‌లోని కాళీని పూరిస్తే వందరూపాయలు బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు. ఆలోచించి... చించి ఇక లాభం లేదని మేం వదిలేశాం. నువ్వు ఆలోచించి నీ అదృష్టాన్ని పరీక్షించుకో."

అప్పారావులో హుషారు వచ్చేసింది. "ఏదీ చూపించరా" అంటూ సారథి ప్రక్కన చేరాడు.

"ఆ కాగితం అతని దగ్గరే వుండిపోయింది. నీకెందుకూ, కళ్ళకు కట్టినట్టుగా ఒక్క గీతకూడా పోకుండానే చెబుతాగా!" అంటూ కంఠం సవరించుకుని సారథి వర్ణన మొదలు పెట్టాడు.

"ధగధగలాడే ఉంగరాల వేళ్లవాడు, బుంగమీసాలవాడు, జరీ అంచుపంచె కట్టినవాడు, స్థూలకాయం వాడు..."

"అంటే నలుగురువున్నారా?" సారథి మాటలకు అప్పారావు అడ్డువస్తూ అన్నాడు.

"జోకు లెయ్యకుండా విను. అలాంటి పెద్ద పెద్ద మనిషిముందు, పీచుజుట్టుతో, మాసికలేసికుట్టిన బట్టలతో, ఒక బక్కచిక్కిన మనిషి మోకరిల్లి కూర్చుని చేతులు రెండూ చాచి, దీనంగా ఏదో ప్రాధేయపడుతున్నాడు. క్రింద 'బాబూ నన్ను కరుణించి' అని మాత్రమే వుంది. ఆ తర్వాత డేష్ అన్నమాట. రెండు పదాలకు మించకుండా సత్యమూర్తి అనుకున్న భావాన్నే చెప్పగలగాలి!"

"బ్రాందీ బాటిలేమైనా ధర్మం చేయమంటున్నాడేమో!" సాలోచనగా అన్నాడు అప్పారావు.

అంతా నవ్వాం.

"అది నేనూ చెప్పాను. కాదన్నాడు. అమ్మాయి పెళ్ళి చేసి ఇలా అయ్యాను, ధర్మం చేయమనీ, ఎన్నికల్లో నిలబడటానికి సీటు ఇప్పించండనీ, అప్పు కావాలనీ, ఇలా చాలా చెప్పాం. అవేవీ కరెక్టు కాదన్నాడు. ఎల్లుండి మన ప్రయాణం వరకే గడువు" జగదీష్ అన్నాడు.

కాసేపు అప్పారావు తల పట్టుకుని కూర్చున్నాడు. చివరకు "ఇది కుదిరే వ్యవహారం కాదులే. ఇంకోచోట ప్రయత్నం చేసుకుంటాను" అంటూ వెళ్ళిపోయాడు.

ఆంధ్రా నుండి నాగపూర్ వచ్చిన ఓ ఎనమండుగురం ఇంజనీరింగ్ స్టూడెంట్సు కలసి ఒక చిన్న ఇల్లు తీసుకుని ఒక అయ్యరుని వంటకి ఏర్పాటు చేసుకున్నాం. రెండు గదులు, ఒక వంటగది వున్నాయి. ముందు ఇంకొక చిన్నగది కూడా వుంది. అందులో ఇంటి యజమాని వుండేవాడు మొన్నటివరకూ. నాలుగు నెలల క్రితం ఆయన అదీ కాళీచేశాడు. అప్పుడు మా సీనియర్ సత్యమూర్తి వచ్చి అందులో చేరాడు. అతను మితభాషి, అప్పుడప్పుడూ మాత్రమే మాతో కబుర్లలో కలుస్తూంటాడు. ఏవో చిన్న చిన్న కథలు రాస్తుంటాడని అన్నారు.

కిందటి నెల్లో మా రూమ్మేటు రాజేంద్రకి ఒక ఉత్తరం వచ్చింది. ఆరోజు క్లాసులు లేవని సత్యమూర్తి రూములోనే ఉన్నాడు. సాయంకాలం మేం రాగానే సత్యమూర్తి రాజేంద్రకి ఆ కవరు ఇచ్చాడు. వెనుక 'నారా నీలవేణమ్మ, అయినవరం' అని రాసుంది.

అయినవరంలో చిన్నప్పుడొకసారి ఆమెను చూసానని రాజేంద్రకి గల బంధుత్వం వివరాలడిగాడు సత్యమూర్తి. రాజేంద్రకి ఆమె వరసకి పెద్దమ్మ అవుతుంది. దూరపు బంధువులు. భూమి తగాదాల్లో వాళ్లకీ, వీళ్లకీ మొన్నటి వరకూ రాకపోకలు లేవు. కానీ ఈ మధ్యనే మళ్ళా కలుసుకుని శుభకార్యాలకీ వాటికీ వస్తూపోతూ వున్నారు. వాళ్ళ చిన్నబ్బాయిని ఇక్కడ చేర్పించాలని వివరాలకోసం రాజేంద్రకి ఆమె ఉత్తరం రాసింది. రాజేంద్ర చెప్పిన వివరాలన్నీ విని ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఆ మరునాడు సత్యమూర్తివచ్చి రాజేంద్రని అడిగిన సంగతివిని మేమంతా ఆశ్చర్యపోయాం. అదేమిటంటే... రెండేళ్ళ క్రితం సత్యమూర్తి రాసిన ఒక నవలకి హాస్యనవలల పోటీలో ప్రథమ బహుమతి వచ్చిందట. విజయవాడలో ఒక ప్రచురణ సంస్థ ఆ నవలని పుస్తకంగా ముద్రిస్తోంది. ఆ పుస్తకాన్ని అయినవరంలో నీలవేణమ్మగారిచే ఆవిష్కరింపచేయాలని సత్యమూర్తి కోరిక! చెల్లెలి పెళ్ళికని రాజేంద్ర వాళ్లవూరుకు రెండు రోజుల్లో వెళ్తున్నాడు కాబట్టి నీలవేణమ్మగారిని అందుకు అంగీకరింపచేయమని అడిగాడు.

రాజేంద్ర 'ఇదేం పిచ్చి' అన్నట్లుగా సత్యమూర్తి వేపు చూశాడు. నిజానికి మాక్కూడా అలాగే వుంది. విజయవాడ లాంటి ఏ సిటీలోనో, ఎవరైనా ప్రముఖ రచయితతోగానీ, సంఘంలో పేరున్న వ్యక్తితోగానీ నవలా విష్కరణ సభ జరిపితే అన్ని విధాలా బావుంటుంది. రచయితగా గుర్తింపు, పబ్లిసిటీ కావాలనుకుంటే అది సరైన పద్ధతిగానీ, ఆ మారుమూల వూళ్ళో, నీలవేణమ్మ గారితో ఆవిష్కరింప చేయటం ఏమిటి, పిచ్చికాకపోతే!

సత్యమూర్తితో అదే చెప్పాం అందరం. రాజేంద్ర కూడా అన్నాడు "మా పెద్దమ్మకి డబ్బున్నది కాబట్టి ఆవూళ్ళో మహిళామండలి సెక్రటరీని చేశారు. అంతకుమించిన ఏ ప్రత్యేకతాలేదు. కాకపోతే మా పెదనాన్నపేరు ఎవరికీ తెలియదు ఆవూళ్ళో. కానీ మా పెద్దమ్మపేరు మాత్రం అందరికీ తెలుసు. డబ్బు వ్యవహారాలు, పొలం వ్యవహారాలు, ఇంటి గొడవలు అన్నీ మా పెద్దమ్మ పెత్తనం మీదే జరుగుతాయి కాబట్టి. మరి నువ్వు ఎందుకలా అడుగుతున్నావో నాకర్థం కావటంలేదు. విచిత్రంగా కూడా వుంది సుమా!"

చిన్నప్పుడు ఆవిడ మాటలు విన్నాడట. ఆ ప్రభావం తనపై పడిందట. అందుకని తన ప్రథమ నవలని ఆమెతో ఆవిష్కరింప జేయాలని కోరిక గలిగిందని సత్యమూర్తి చెప్పాడు. చివరకు రాజేంద్ర "సరే, అడుగుతాను నీకంత ఇష్టంగా వుంటే" అన్నాడు.

పెళ్ళికి వెళ్ళిన రాజేంద్ర వారం రోజులకి తిరిగివచ్చాడు. నీలవేణమ్మగారు కూడా ఇదేమిటని మొదట చాలా ఆశ్చర్యపోయిందట. ఆ తర్వాత ఆనందంగా అంగీకరించిందట. కాకపోతే తనకి ఉపన్యాసాలు చెప్పేపని మాత్రం పెట్టవద్దని అన్నారని రాజేంద్ర సత్యమూర్తికి చెప్పాడు.

రాజేంద్ర చెప్పింది విన్నాక సత్యమూర్తి మొహంలో కనిపించిన ఆనందానికి నాకు మరీ ఆశ్చర్యంగా అనిపించింది! సత్యమూర్తిని అంతగా ఆకర్షించిన ఆమెని చూడాలని నాకూ అనిపించింది. మేమందరం ఆ సభకి రావాలని సత్యమూర్తి అడిగినప్పుడు ఆనందంగా అంగీకరించాం.

సత్యమూర్తి ఏర్పాటు మొదలుపెట్టాడు. రాజేంద్ర మా అందరికంటే ఒకరోజు ముందుగా అక్కడికి చేరి స్టేజి, కుర్చీలు, మైకు, పూలదండలు లాంటి ఏర్పాట్లు చూడటానికి నిర్ణయమైంది. మేం విజయవాడ చేరేసరికి ఆవూళ్ళోనే వుంటున్న సత్యమూర్తి చిన్నాన్న అయినవరానికి రానూపోనూ ఒక

టేక్సీని మాట్లాడి స్టేషనుకు పంపిస్తానని అన్నారు. పబ్లిషరు దగ్గర్నుండి పుస్తకాలు తీసుకుని వాళ్ళ చిన్నాన్న అందజేస్తారు. ఇలా అన్నీ సత్యమూర్తి చకచక ఏర్పాట్లు పూర్తిచేశాడు.

సభ పూర్తయిన తర్వాత నీలవేణమ్మగారు మా అందరికీ విందు భోజనాలు ఏర్పాటు చేస్తానని అన్నారని రాజేంద్ర చెబితే సత్యమూర్తి అందుకు ఒప్పుకోలేదు. సభ అయిన వెంటనే కారులో అందరం విజయవాడ చేరుకుని అక్కడ నుండి ఎవరి వూరికి వాళ్ళు ట్రైను చూసుకుని వెళ్లిపోవటమేనని చెప్పాడు. ఆరోజు రాత్రి తను తప్పనిసరిగా విజయవాడలో వుండాల్సిన పని ఉందన్నాడు.

అనుకున్న ప్రకారం రాజేంద్ర ఏర్పాట్లకని సత్యమూర్తి ఇచ్చిన డబ్బు తీసుకుని ఒక రోజు ముందుగా వెళ్ళాడు. ఆ మరునాడే మేం అందరం బయలుదేరాం. మా అందరితోపాటూ అప్పారావు వచ్చాడు. అతను మా రూములో కాకుండా వేరేచోట వుంటాడు. అయినా మాతోవున్న స్నేహం కొద్దీ అతని వూరు విజయవాడ దగ్గర కాకపోయినా వచ్చాడు.

“సత్యమూర్తిని అంతగా మెప్పించిన ఆ నీలవేణమ్మగారి గొప్పతనం తెలుసుకోవాలని నీకూ అనిపించిందా!” అంటూ నవ్వాం. వాడికీ ఈ సభపట్ల ఆసక్తిగా వుంది. చిత్రమైన విషయమేమిటంటే ఆనవల పేరేమిటో మాకు తెలియదు. వీక్లీలో సీరియల్‌గా వచ్చినప్పుడు ఆ నవల పేరు ‘అనుకోనిది’ అట. పబ్లిషరు ఆ పేరు ఆ నవలకి అంతగా సూటవలేదని మారుద్దామని అంటే, సత్యమూర్తి ఓ మూడు పేర్లు చెప్పి ఆ మూడింటిలో ఏదో ఒకటి ఎవరైనా రచయిత సలహా ప్రకారం నిర్ణయించమని చెప్పినందువలన సత్యమూర్తికీ తెలియదని చెప్పాడు.

మేం విజయవాడ చేరేసరికి మధ్యాహ్నం మూడు గంటలయింది. స్టేషనులో సత్యమూర్తి చిన్నాన్న కొడుకు టేక్సీతో, పుస్తకాలతో సిద్ధంగా వున్నాడు. అందరం మొహాలు కడిగి ఫ్రెష్‌అయి, కాఫీటిఫిన్లు తీసుకుని అయినవరం బయలుదేరాం. కొన్ని పుస్తకాలు న్యూస్‌పూపరులో కట్టి వున్నాయి. ఒకటి మాత్రం రంగు కాగితంతో సన్నటి రిబ్బనుతో ముడివేసి వుంది. నేను న్యూస్ పేపరులో కట్టివున్న పుస్తకాలనుండి ఒకటి బయటకు తీశాను.

సత్యమూర్తి మాకు చూపించిన కార్టూను రంగుల్లో ముఖచిత్రంగా ఉంది. ఆ నవల పేరు చూడగానే నాలో ఫ్లాష్ వెలిగింది! పేజీ తిప్పగానే నా ఆలోచన కరెక్టేనని తేలింది. లోపలి పేజీలో కూడా ఆ కార్టూన్‌వుంది. కింద “బాబూ, నన్ను కరుణించి నా బాకీ తీర్చరా?” అనిరాసి ఉంది.

ఇంతకీ ఆ నవల పేరు “అప్పు ఇచ్చి చూడు” ఆ టైటిల్ చెబితే మేం ఆ డేష్‌ని తేలిగ్గా పూర్తి చేయగలుగుతామని కాబోలు సత్యమూర్తి తనకీ ఇంకా తెలియదంటూ చెప్పలేదన్నమాట.

“ఒరేయ్ అప్పారావూ, సత్యమూర్తి నీ గురించే రాసినట్లున్నాడు” అంటూ నవల చూపించాను. “అదేమిటీ, నేనెవరికైనా అప్పు ఇచ్చానా, తీసుకోవటమేగానీ” అంటూ జోక్ చేశాడు!

పుస్తకం తెరవగానే మొదటి వాక్యమే నన్ను బాగా ఆకర్షించింది. “అప్పు ఇచ్చి చూడు మిత్రమా, బంధువే శత్రువగును అదేమి చిత్రమో” అని వుంది.

ఏకబిగిని నేను నవలంతా పూర్తిచేసేసాను. ఒక కుటుంబరావుకి పిత్రార్జితమైన పొలం అమ్ముకుంటే కొంత డబ్బు వస్తుంది. అది వడ్డీకిస్తే, పెరిగాక ఇల్లు కట్టుకోవచ్చనే ఆశతో తెలిసిన వాళ్ళకి ఇస్తాడు. ఆ తర్వాత వసూలు చేసుకోవటంలో ఆ కుటుంబరావు కుటుంబం పడ్డపాట్లే ఆ

నవలకి ఇతివృత్తం. సంభాషణలు చాలాహాస్యంగా, చమత్కారంగా వున్నాయి. నాకు బాగా నచ్చింది. అందుకే ప్రథమ బహుమతి వచ్చింది అనుకున్నాను. ఇంతలో అయినవరం వచ్చేసింది.

అక్కడ అందరూ మాకోసమే ఎదురు చూస్తున్నారు. నీలవేణమ్మగారింటికి ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలోనే సభకి ఏర్పాటు చేయమని సత్యమూర్తి ముందుగానే చెప్పాడు. రాజేంద్ర ఏర్పాట్లన్నీ బాగా చేశాడు. నీలవేణమ్మ గారింటి పక్కనే వుండే మాజీ ఎం.ఎల్.ఏ. రఘుపతిగారిని ముఖ్య అతిథిగా రాజేంద్ర ఆహ్వానించినట్లు చెప్పాడు.

నీలవేణమ్మగారు పెద్ద జరీ అంచు పట్టుచీరెకట్టుకుని, బంగారు గాజులు, గొలుసుతో హుందాగా వున్నారు. సత్యమూర్తిని ఆమెకి పరిచయం చేసినప్పుడు పరీక్షగా చూస్తూ "ఎక్కడో చూసినట్లుందే!" అన్నారు. సత్యమూర్తి చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

సభ ప్రారంభం అయింది. వేదికపై సత్యమూర్తి, రఘుపతిగారు, నీలవేణమ్మగారు కూర్చున్నారు. సత్యమూర్తి రఘుపతిగారినీ, నీలవేణమ్మగారినీ పూలదండలతో సత్కరించటం, ముందు మాటలు అన్నీ ఆనవాయితీ ప్రకారం జరిగాయి.

ముందు రఘుపతిగారు ఆనర్గళంగా అయిదు నిమిషాలసేపు మాట్లాడారు. ఒక రచయిత తమ వూరికి వచ్చి ఇలాంటి సభ జరపటం అదే ప్రథమమనీ, గర్వకారణం అనీ అన్నారు. తమ వూరిలోని వ్యక్తి అయిన నీలవేణమ్మగారిలోని గొప్పతనాన్ని గుర్తించి ఇలాంటి గౌరవాన్ని రచయిత కలిగించినందుకు ఆనందంగా వుందన్నారు. రచయిత పురోభివృద్ధిని కాంక్షిస్తూ ప్రసంగాన్ని ముగించారు.

అప్పుడు నీలవేణమ్మగారు రిబ్బనుముడిని విప్పి పాకెట్టులోని పుస్తకాన్ని తీసి పైకెత్తి సభ వేపు చూపించారు. అందరం ఆనందంగా చప్పట్లు కొట్టాం.

సత్యమూర్తి మాట్లాడాడు. ముందుగా సభికులకీ, నీలవేణమ్మగారికీ, రఘుపతిగారికీ వందనాలర్పించి ప్రసంగాన్ని కొనసాగించాడు.

ఏం చెబుతాడా అని నాకు చాలా ఉత్సుకతగా వుంది. ప్రసంగం మొదలుపెట్టాడు.

"మునుపటి రోజుల్లో అప్పు ఇచ్చే వారి చేయి పైచేయిగానూ, అప్పు తీసుకునేవారి చేయి కిందచేయిగానూ వుండేది. అప్పటిరోజుల్లో అప్పు ఎగవేయటం అంటే తప్పు. ఇప్పుడా రోజులుపోయాయి.

నైతిక విలువలు మారాయి. ఇప్పుడు అప్పు తీసుకునే వారిదే పైచేయి. బాకీ వసూలు చేసుకోవాల్సిన వారిదే కిందచేయిగా పరిస్థితి మారింది! అప్పులు ఎగవేయగలగటం మనిషి సామర్థ్యానికి చిహ్నమైంది. ఎలాగైనా గొప్పవాడు కాగలిగితే చాలు – గౌరవం లభిస్తోంది.

ఈ ఇతివృత్తంతోనే నేనీ నవలను రాశాను. ఈ నవలను రాయటంలో నా స్వానుభవం వుంది.

నేను టెన్త్‌క్లాసు చదువుతున్న రోజుల్లో ఒకసారి మమ్మల్ని ఎక్స్‌కర్షన్‌కి తీసుకువెళ్ళారు. అక్కడకు బాగా దగ్గరగా వుండే వూళ్ళో మాకు రావాల్సిన బాకీ ఒకటి వుంది. వాళ్ళతో మాకు పరిచయం, స్నేహం లేకపోయినా మా స్నేహితుడైన మధ్యవర్తి ద్వారా ఇచ్చాం. ఆ మధ్యవర్తి పట్ల మాకువున్న నమ్మకం కొద్దీ నోటు ప్రసక్తిలేకుండా నోటిమాటమీదే ఇచ్చాం. మధ్యలో మధ్యవర్తి తప్పుకున్నాడు.

ఉద్యోగరీత్యా చాలా దూరంగా కూడా వెళ్ళిపోయాం. దాంతో వాళ్ళు నాలుగేళ్ళు తిప్పలుపెట్టి కొంత ఇచ్చారు. ఇంకా రావల్సిన బాకీ గురించి అక్కడ వరకూ వెళ్తున్నాకదాని మాష్టారు పర్మిషన్ తీసుకుని మావాళ్ళు వెళ్ళి అడగమన్నారు.

ఎవరినైనా అప్పు అడగాలంటే బిడియపడాలిగానీ మాకు రావాల్సినవి అడగటానికేం అనుకుని, స్నేహితుడిని తోడు తీసుకుని ధీమాగా వెళ్లాను అడ్రసు కాగితం పట్టుకుని.

వాళ్ళకు నేనెవరో ఎందుకు వచ్చానో దర్జాగానే చెప్పాను. ఎంతో కొంత ఇచ్చినా, అదే గొప్పనుకుని సంతోషించకుండా, ఇంకా రావాలంటూ వెతుక్కుంటూ వాళ్ళింటికి వచ్చిన నా అజ్ఞానానికి మొదట ఆశ్చర్యపోయారు. నిజమేమరి, మావూరుకాని వాళ్ళకి మధ్యవర్తి మాటల మీద నమ్మకం కొద్దీ ఎవరికో డబ్బు ఇవ్వటం అమాయకత్వమే!

ఆ సమయంలో వాళ్ళింట్లో నలుగురున్నారు. తగుదునమ్మా అంటూ వాళ్ళింటికి వచ్చిన నా దుస్సాహసాన్ని క్షమించలేకపోయారు. నలుగురూ నాలుగు వైపులా నిలబడి నలభై గొంతుకలతో మామీద విరుచుకుపడ్డారు. ఎందుకో ఏమిటో నాకర్థంకాలేదు.

డబ్బు సంగతి వదిలేసి ఎప్పుడో వాళ్ళు మా యింటికి వచ్చినప్పుడు మర్యాదలు చేయలేదట. మంచినీళ్ళు అయినా ఇవ్వలేదట! నేనే వాళ్ళు వచ్చినప్పుడు షాపు నుండి గోల్డ్‌స్పాట్‌లు తెచ్చాను. అదే అన్నాను. నీబోడి గోల్డ్‌స్పాట్‌లు ఎవరిక్కావాలీ అని ఇంకా పెద్దగా అరుస్తున్నారు.

చిన్నప్పుడు చదువుకున్న ఒక కథ ఆ సమయంలో గుర్తుకొచ్చింది. కాలవ దగ్గర నీళ్ళు తాగటానికి వచ్చిన మేకపిల్లను చూసి ఒక తోడేలు చంపి తినాలని నిర్ణయించుకుని 'ఆరునెలల కిందట నన్ను తిట్టావట' అని గొడవపెడుతుంది. అమాయకంగా ఆ మేకపిల్ల 'ఆరునెలల కిందట నేను పుట్టనేలేదే మిమ్మల్నెలాతిట్టాను?' అని బదులిస్తే, 'నువ్వు కాకపోతే నీ తల్లి తిట్టి వుంటుంది' అంటూ దానిపైబడి తోడేలు తింటుంది!

వాళ్ళు డబ్బు ఇవ్వదలుచుకోలేదు. ఇవ్వలేమనికానీ, ఇవ్వమనికానీ చెప్పటం వాళ్ళ అంతస్థుకు చిన్నతనం. అందుకే అలా మర్యాదల సంగతి ఎత్తి దుయ్యబట్టారు. తల్లి, కూతురు, కొడుకులిద్దరూ కలిసి మమ్మల్ని చుట్టుముట్టి అరుస్తూంటే పక్కఇళ్లవాళ్ళు గోడల మీదనుండి, దారినిపోయేవాళ్ళు ఆగి, గుంపుగా పోగయ్యి చూస్తున్నారు. వాళ్ళింట్లో ఏదైనా దొంగతనం చేసి పట్టుబడ్డందుకు వాళ్ళు అలా అరుస్తున్నారనే చూసినవాళ్లు అనుకుని వుంటారు. ఆ జనానికి 'అయ్యా, నేనేమీ తప్పు చేయలేదు. బాకీ వసూలు కోసం రావటమే నేను చేసిన అపరాధం' అని చెప్పుకోవాలనిపించింది. కానీ ఆనాడు ఆపని చేయలేకపోయాను.

ధనవంతుడికి సామాన్యుడు అప్పు ఇచ్చినా లోకువే, తీసుకున్నా లోకువే అని అనుభవ పూర్వకంగా ఆవయసులోనే తెలుసుకోగలిగాను. ఆరోజు నేను పొందిన అవమానం చాలా రోజులు నామనసును దహించింది. ఏం నేరం చేశాడో అన్నట్లుగా జనం చూస్తూంటే, వాళ్ళు మాటలతో తరిమికొడ్తోంటే, నిస్సహాయంగా కళ్ళనీళ్ళతో స్నేహితుడితో కలిసి ఆ ఇంటి నుండి బయటకు వచ్చిన రోజుని నేను మర్చిపోలేకపోయాను.

ఆ ఆవేదన నుండి... అవమానాగ్ని నుండి... ఆ మథన నుండి స్వాంతన పొందటానికి, కలం పట్టాను. బాకీ వసూలు చేసుకోవటంలో మా కుటుంబం పడిన అగచాట్లనే యథాతథంగా చిత్రిస్తే, అది హాస్యనవలగా రూపుదిద్దుకుంది. అంటే జీవితంలోని నగ్నసత్యాల నుండే హాస్యరసం జనిస్తుందనుకుంటాను.

మీలోని కొంతమంది ఆరోజు ఇదేవీధిలో నన్ను చూసి వుంటారు. వయసుతో నాలో శారీరకంగా వచ్చిన మార్పు వలన గుర్తుపట్టలేకపోయుండవచ్చు. ఆపైన ఆ సంఘటనను మీరు ఆనాడే మర్చిపోయుంటారు.

ఒక విధంగా కాకపోయినా, మరొకవిధంగా నీలవేణమ్మగారు మా బాకీని తీర్చారని నేను అనుకుంటున్నాను. పరోక్షంగా నన్ను రచయితనిచేసి, నాకు గుర్తింపు, గౌరవం లభించటానికి మూలకారకురాలు కాబట్టి నా కృతజ్ఞతాభివందనాలు!" – నమస్కరిస్తూ సత్యమూర్తి ముగించాడు.

సత్యమూర్తి చివరి మాటలు వింటూ షాక్ తగిలినట్లుగా బిగుసుకుపోయాం మేమంతా! అతని ధైర్యానికి విస్తుపోయాం! అప్పటి వరకూ చిరునవ్వుతో వింటున్న నీలవేణమ్మగారి మొహంలో రంగులు మారిపోయాయి. ధుమధుమలాడుతూ స్టేజి దిగివెళ్ళిపోయారు.

సత్యమూర్తిలాంటి అభిమానులే నీలవేణమ్మగారికి చాలామంది వున్నారు కాబోలు చప్పట్లహోరు మిన్ను ముట్టింది! స్టేజి దిగివస్తున్న సత్యమూర్తి వదనంలో... ఎప్పటి నుండో బాధపెడుతున్న గాయమేదో మటుమాయమైనట్లుగా ప్రశాంతతతో కూడిన ఆనందం రెపరెపలాడుతోంది!

ఈనాడు ఆదివారం. 2, సెప్టెంబరు, 1990.